# మూడు జంటల కథ

లతిక



ఆఫీసు వదిలివస్తూ, తోవలో హోటల్లో కాఫీ తాగి, రూము చేరుకున్నాడు రాజు. ఇంటిగల వారమ్మాయి పోస్టులో వచ్చిన కవరు తెచ్చి అందించింది. అతని ఉత్తరాలు ఆఫీసుకే వస్తాయి. ఒక్కరి దగ్గరనుంచి మాత్రమే ఇంటి అడ్రసుకి వస్తుంది. అవి అతని ప్రియురాలు

రాణి దగ్గరనుంచి. ఉత్తరం యిచ్చినప్పుడల్లా యిల్లు గలవారమ్మాయికి చాకలెట్లు యిస్తూం టాడు.

ఉత్తరం తీసుకుని, చింపి ఆసక్తితో చదువు కున్నాడు. రాణికి పెళ్ళి సంబంధాలు చూస్తు న్నారు. రాజు నటుడు. చాలా పరిషత్తులలో ఉత్తమ నటనకి బహుమతులుపొందేడు. రాణి తల్లికి నాటకాల వాళ్ళంటే అయిష్టం. వాళ్ళ శీలం మంచిదికాదని ఆవిడ అనుమానం, నమ్మకంకూడా: అంచేత రాణి రాజును పెళ్ళాడ్డం ఆమె కిష్టంలేదు.

పెద్దలు రాణికి రామారావు సంబంధం చూశారు. అతను హైదరాబాదులో వున్న వో ప్రసిద్ధ ఔషధ సంస్థలో రిప్రజెంటేటివ్. వాళ్ళ పెద్దలు రాణిని చూసి, నచ్చి, కట్నాలూ వగైరా నిర్ణయించేసుకున్నారు. రాణి ఫొటో రామా రావుకి పంపించారు. బిజినెస్ గురించి వైజాగ్ వచ్చినపుడు రాణిని చూసుకుని, అతను తన అంగీకారం తెలియజెయ్యడమే తరవాయి. రాణికి అతనితో సంబంధం కుదిరినట్టే. అతను వారం రోజుల్లో వైజాగు వస్తున్నాడు. అంచేత యీలోగా రహస్యంగా ఆ సంబంధం తప్పేలా చూడడం రాజు కర్తవ్యమని రాణి రాసిన వుత్తరం సారాంశం.

రాజు తన సమస్య పరిష్కారానికి వుపాయం ఆలోచించడంకోసం స్నేహితుడు చంద్రశేఖరం దగ్గరికి బయల్దేరాడు. శేఖరం రచయిత. అతను రూములోనే వున్నాడు. రాణి రాసిన వుత్తరం గురించి చెప్పి, సలహా అడి గాడు.

"ఒక్కటే వుపాయం. ఆ రామారావుగారిని కలిసి, విషయం ఆయనకి చెప్పేసి, సాయం చెయ్యమని రిక్వెస్టు చెయ్యడమే. ఆయన కంపెనీ వివరాలు నీకు రాసిందికదా? మనూళ్ళో వున్న రెండు పెద్ద మెడికల్‌షాపులవాళ్ళనీ కలిసి, ఆయన వచ్చినపుడు మనకి తెలియ జెయ్యమందాం. మరొకరికి మనసిచ్చిన అమ్మా యిని, పెద్దలమాట విని చేసుకునే మనస్తత్వం అతనికి వుండకపోవచ్చనే అనుకుందాం" అంటూ శేఖరం మిత్రుణ్ణి వోదార్చాడు.


"నిజమే ననుకో: రాణి అందమైనది. అతను పెద్దలమాట వినే అపర రామచంద్రుడనుకో, అప్పుడెలా?" రాణిని రామారావు యెగిరి గంతేసి పెళ్ళాడేస్తున్నాడన్నంత నిరాశతో అడి గాడు రాజు. "అప్పటి సంగతప్పుడు చూసు కుందాం. ముందు అతను వచ్చినపుడు మనకి తెలియజెయ్యమని మెడికల్ షాపులవాళ్ళకి చెప్పివద్దాం పద" మిత్రులిద్దరూ రోడ్డుపట్టారు. శని ఆదివారాలలో రామారావు విశాఖ వస్తున్నట్టు మెడికల్ షాపులలో తెలిసింది.

## 2

రాజు, శేఖరం శనివారం ఆఫీసుకి సెలవు పెట్టుకున్నారు. హైదరాబాదు నుంచి వచ్చి, హోటల్లో దిగి, మెడికల్ షాపులకి వచ్చే వేళల గురించి ఓ అంచనాకి వచ్చాక, ఆ టైముకి మిత్రద్వయం వొక మెడికల్ షాపులో నిరీక్షి స్తున్నారు.

వాళ్ళ అంచనా ప్రకారం రామారావు వచ్చాడు. షాపు వాళ్ళకి మందులకి సంబంధిం చిన లిటరేచరూ, శాంపిల్సూ యిచ్చి ఆర్డరు బుక్ చేసుకున్నాడు. మనిషి స్ఫురద్రూపి. మాటకారితనం గురించి ప్రత్యేకం చెప్పనక్కర లేని వృత్తి. అతనికి రాణి నచ్చడం మాటెలా వున్నా, రాణి అతన్ని చూస్తే, మనసు మార్చేసుకుని అతన్నే వరించేస్తుందేమో అని భయం కలిగింది రాజుకి.

రామారావు సెలవు తీసుకుని బయల్దేర బోతూండగా షాపు యజమాని మిత్రులిద్దరినీ అతనికి పరిచయం చేశాడు. రవీంద్రభారతిలో రాజు ప్రదర్శన చూసేనని చెప్పి, అతన్ని కలుసుకున్నందుకు సంతోషం వెల్లడించాడు రామారావు. శేఖరం కథలు తరచు పత్రికలలో చూస్తున్నానన్నాడు. ఈసారి హైదరాబాదు వచ్చేటప్పుడు తెలియజేస్తే అవసరమైన సహాయం తప్పకుండాచేస్తానని చెప్పాడు. రాజు యెక్కువగా మాట్లాడే స్థితిలో లేడు. శేఖరమే కలగజేసుకుని అడిగాడు.




"మీతో కొన్ని విషయాలు మాటాడాలి. మీ కెప్పుడు వీలవుతుంది సార్!"

"ఆంజనేయుడు సూర్యుడి దగ్గర విద్యాభ్యాసం చేశాట్ట, అతనితోపాటు ఉదయాద్రినుంచి పడమటి కొండలవరకూ సంచరిస్తూ! మా వృత్తి సూర్యుడి పరిభ్రమణం లాటిది. ఈ వాళంతా వైజాగ్ చుట్టబెట్టి, ఒకటీ అరా షాపులు మిగిలితే రేపుదయం అవికూడా సందర్శించి, మధ్యాహ్నం వొక స్వంతపని చూసుకుని సాయంత్రం స్టేషనుకి చేరాలి. ఇదీ నా ప్రోగ్రాం. మీ కెప్పుడు అనుకూలంగా వుంటుందో మీరే చెప్పండి."

"మీరు హోటలుకి ఏటైముకి చేరగలరు?"

"సుమారు తొమ్మిదనుకోండి. అంతవరకూ మిమ్మల్ని వెయిట్ చెయ్యమనడం భావ్యం కాదు. ఒక మహానటుణ్ణీ, వొక గొప్ప రచయితనీ నా రొటీను పూర్తయేవరకూ వుండమనలేను. మరో రెండు ఏజన్సీలు చూసొస్తాను. ఈవాళ మీరు నా గెస్టులు. మీ రెక్కడికి రమ్మంటే అక్కడికి వస్తాను, వో పదినిముషాలు అటూ యిటోలో! దయచేసి మరోలా అనుకోకండి."

శేఖరం వొక హోటలుపేరు చెప్పి అక్కడ కలుద్దామని చెప్పాడు. మరో రెండు గంటల్లో అక్కడికి చేరుకుంటానన్నాడు రామారావు

హోటల్లో

"చెప్పండి సార్!" రామారావు అడిగాడు.

"ఇది వొకరకంగా చిన్న సర్వే! అభిప్రాయ సేకరణన్నమాట. వివిధ రకాల వ్యక్తుల్ని ఈ విషయంలో కలుస్తున్నాం. మీరు నిర్మొహమాటంగా మీ అభిప్రాయాలు చెప్పాలి. మీ సమాధానాలమీద కొందరి భవిష్యత్తు ఆధారపడి వుంటుంది" శేఖరం చెపుతున్నాడు.

"రియల్లీ ఇంటరెస్టింగ్! ఇవే మా మాటల్లో చెప్పాలంటే మరో హామీకూడా చేరుస్తాం. వివరములు రహస్యంగా వుంచబడును" నవ్వుతూ చెప్పాడు రామారావు. మిత్రులిద్దరూ శ్రుతికలిపారు.

"మా సర్వేలోకూడా అది తప్పకుండా

పాటిస్తాం. ఇక అసలు విషయం. సమస్య యువతీ యువకుల పెళ్ళి. తమ అభిప్రాయాలకి విరుద్దంగా తలిదండ్రులు మరో సంబంధం చూస్తారనుకోండి. ప్రేమించిన అమ్మాయిని నట్టేట్లో వొదిలేసి, తన దారి తను చూసుకోడం మంచిదే నంటారా? మీరైతే యేం చేస్తారు?"

"ఇక్కడ మీరొక విషయం స్పష్టంగా చెప్పలేదు. ప్రేమంటే — మనసులు యిచ్చి పుచ్చుకోడమేనా? ప్రేమ వ్యవహారంలో యింకేమైనా సాహసాలుకూడా చేరారా? అదికూడా ఆలోచించాలి. నా మట్టుకి నాకు యువతీయువకులు వో నిర్ణయానికి వచ్చాక, పెద్దలు యిష్టపడకపోయినా, స్వతంత్రించి పెళ్ళి చేసుకునే ధైర్యం వుండాలి. ఉన్నప్పుడే ప్రేమించడం ప్రారంభించాలి."

"మీ అభిప్రాయం బాగుంది. అలాటి పరిస్థితి మీ కెదురైతే యేం చేస్తారు?"

"కేవలం చెప్తే సరిపోతుందా? ఆచరణలో వుండాలికదా! నిజం చెప్పాలంటే నేనా పరిస్థితిలోనే వున్నాను."

రాజులో ఆసక్తి కలిగింది. రామారావు ప్రారంభించాడు. "మా వాళ్ళు యిక్కడో సంబంధం చూశారు. ఆ అమ్మాయిని నేనుచూసి నా అభిప్రాయం చెప్పాలి. అఫ్‌కోర్స్! చూడ్డం అనవసరమనకోండి."

"అదేం అలా అన్నారు?"

"ఎందుకంటే, నేను చేసుకోబోయేది పెద్దల యిష్టానికి వ్యతిరేకంగా మరో అమ్మాయిని కాబట్టి! ఆమె తలిదండ్రులకి రెండో అమ్మాయి. పెద్దామె పెళ్ళయేవరకూ మేం వెయిట్ చెయ్యాలి. అంచేత యిలా పెద్దలు చెప్పిన సంబంధాలు చూస్తూ కాలయాపన చేస్తున్నాను. ఇక్కడి సంబంధం అలాగే లాంఛన ప్రాయంగా చూసి, నా కిప్పట్లో పెళ్ళి వుద్దేశం లేదని నాన్నగారికి రాసేస్తాను."

రాజుకి గుండె బరువు తీరింది. తేలికగా నిట్టూర్చేడు. అసలు సంగతి చెప్పడమే మంచిదని తోచింది శేఖర్‌కి. రాణీ రాజుల ప్రేమ సంగతి చెప్పి, రామారావు సహాయం కోరాడు శేఖర్.

బ్రీఫ్‌లోంచి రాణి ఫొటో తీసి చూపిస్తూ అడిగాడు రామారావు, "ఈ అమ్మాయేనా?"

"అవును"

"రేపు వాళ్ళింటికెళ్ళి, మీ సొత్తు—అదే వాళ్ళ ఫొటో వాళ్ళకిచ్చేస్తాను. శుభలేఖ పంపడం మాత్రం మరిచిపోకండేం?"

"ఎంత మాటసార్! నాకు బంధువులులేరు. ఉన్నదంతా మీలాటి ఫ్రెండ్సే. మీరే దగ్గరుండి పెళ్ళి జరిపించాలి" రాజు కృతజ్ఞతతో అన్నాడు.

"విత్ ప్లెషర్! ఓ నెల ముందే అందేలా శుభలేఖ పంపండి. దాన్నిబట్టి ఘా టూరు ప్రోగ్రాం ఫిక్స్ చేసుకోవాలి" అంటూ ఫొటో కవరులో పెట్టి బ్రీఫ్‌లో పెట్టుకోబోతూ,

"బైదిబై! ఈమె జానకి! వ్యాసమూర్తిగారి పేరు వినేవుంటారు. హి యీజ్ వనాఫ్‌ది లీడింగ్ పబ్లిషర్స్. దేవుడు చల్లగా చూసి అన్నీ సక్రమంగా జరిగితే ఈమె నా అర్ధాంగి అవుతుంది" అంటూ మరో ఫొటో చూపించాడు.

రామారావుకి రాజు మరీ మరీ కృతజ్ఞతలు వెళ్ళడించుకున్నాడు. "నేనే మీకు థేంక్సు చెప్పుకోవాలి! అనవసరంగా వొకమ్మాయి తలిదండ్రులలో ఆశలు కలిగించి, ఆశాభంగం కలిగించే డెలికేట్ సిట్యుయేషను నుంచి తప్పించారు" అంటూ యిద్దరి అడ్రసులూ తీసుకున్నాడు రామారావు.

## 3

శేఖరం ఆఫీసులో వుండగా బోయ్ వచ్చి హైదరాబాదు నుంచి ట్రంకాల్ వచ్చిందని చెప్పాడు. తనకి హైదరాబాదునుంచి ఫోనుచేసే దెవరా అని ఆశ్చర్యపడుతూ వెళ్ళి, రిసీవర్ అందుకున్నాడు శేఖరం.

"హలో శేఖరంగారూ! నేను రామారావుని! మీరూ రాజుగారూ యింటర్వ్యూ చేశారు, నమస్తే! మీతో అవసరంపడింది . ఈ మధ్య పత్రికల వాళ్ళు పోటీల్లో కొత్త పద్ధతులు అవలంబిస్తున్నారు కదా! అదే, రీ నంబరింగ్




యిచ్చి పరీక్షపేపర్లు దిద్దే పద్ధతి! మీరు విక్రాంతి మంత్లీ కథలపోటీకి యేఁవేనా పంపించారా? మరేంలేదు — బీయస్సీలో నా బెస్టు ఫ్రెండొకాయన, వనాఫ్ ది జడ్జెస్! కథల సెలక్షను కమిటీలో ఆయనకి మరికొందరు తెలిసినవాళ్ళున్నారు. మీ కథపేరు చెప్తే వద్దంటారా .. టాలెంటొక్కటే చాలదు మహాశయా! మీ స్టేండర్డుమీద మీకా ఆత్మవిశ్వాసం వుండడం మంచిదే! ప్రయత్నంకూడా చేస్తే తప్పులేదు కదా? ప్లీజ్! మనకో అవకాశం అందుబాటులో వున్నపుడు వినియోగించుకోవడంలో తప్పేం వుంది? కథపేరు చెప్పండి! ఓకే! ఇక అసలు సంగతికి వస్తాను. రాజుగారి ప్రేమాయణంలో నే నడ్డొచ్చినట్టే, మా మామగారి దృష్టిలో మీరున్నారు. పెద్దామెకి పెళ్ళి సెటిలయింది. ఒకప్పుడు రాజుగారి అవస్థే నాకు కలిగింది. ఆదివారం యేకాదశినాడు వ్యాసమూర్తిగారు, జానకిని మీ కిస్తామని చెప్పడానికి వైజాగ్ వస్తున్నారు. మీరు నాకు లైన్ క్లియరివ్వాలి. ఈ వారం హెడ్‌క్వార్టర్సులోనే వుండాల్సి వచ్చింది. లేకపోతే వచ్చి పెర్సనల్‌గా రిక్వెష్టు చేసేవాణ్ణి! మా పెళ్ళి జరిపించే బాధ్యత మీది.. ప్రామిసేకదా థేంక్యూ వుంటాను మరి. సెలవు" ఫోను పెట్టేశాడు రామారావు.

శేఖరానికి లోగడ తనూ రాజూ పడిన అవస్థ గుర్తొచ్చింది. రాజు విషయంలో రామారావు సాయపడ్డాడు. అతని విషయంలో తను సాయపడబోతున్నాడు. మరొకరికి సహాయం చెయ్యడంలో వున్న తృప్తి, ఆనందం అనుభవానికి వచ్చేవేళ అతనికో అనుమానం కలిగింది. కొంపదీసి తన విషయంలోకూడా యెవరినేనా సహాయం కోరాల్సి వస్తుందా!

ఆఫీసు వదిలి, రూము చేరుకుని, తలుపు తెరిచేసరికి రెండు కవర్లు కనబడ్డాయి. కొత్తగా పత్రిక ప్రారంభిస్తూ, తననో కథ పంపమని రాసిన ఆహ్వానం వొకటి. రెండోది పార్వతి రాసినది.

శేఖరం రచనా వ్యాసంగం ప్రారంభించి

పదేళ్ళయితే, సుమారు రెండేళ్ళుగా పార్వతి అతని అభిమాన పాఠకురాలిగా పరిచయమైంది. విజయవాడ హనుమంతరాయ గ్రంథాలయంలో రచయితల మహాసభకి డెలిగేట్‌గా వెళ్ళినప్పుడు ఆమె శేఖరాన్ని కలుసుకుంది. అతని రచనల గురించి, సెంటిమెంట్ల గురించి, ఆశయాలూ అభిరుచుల గురించి, యింకా బోలెడు విషయాల గురించి యిద్దరూ చర్చించుకున్నారు. చాలా విషయాల్లో యిద్దరిదీ వొకే అభిప్రాయం.

అప్పటినుంచి ఆమె వుత్తరాలలో రచనల గురించేకాక, శేఖరం గురించికూడా ఆసక్తి వెల్లడించేది. అది ప్రేమగా రూపొందింది. ఆమె తండ్రి సూరిబాబుగారు ప్రఖ్యాత రంగస్థల నటుడు, ప్రయోక్త! ఆయనకి రాజు నచ్చేడు. పార్వతిని రాజుకిచ్చి పెళ్ళి చెయ్యాలని ఆయన సంకల్పం. ఆదివారం ఏకాదశి నాడు ఆయన పెళ్ళిచూపులకి రాజుని ఆహ్వానించడానికి వైజాగ్ వస్తారు. తనని దక్కించుకునే భారం శేఖరానిదేనని పార్వతి వుత్తరం సారాంశం.

శేఖరానికి థ్రిల్లింగ్‌గా అనిపించింది. కథలలో అసహజంగా కనిపించే సంఘటనలు జీవితాలలో చోటు చేసుకోడం చిత్రంగానే వుంటుంది. అతనికి రామారావు ఫోను సంభాషణ గుర్తొచ్చింది. ఎంత లౌక్యం ప్రదర్శించేడు? తనకో వుపకారం చేస్తున్నట్టు చెప్పి, ముందు కాళ్ళకి బంధంవేసి, అసలు విషయం వెల్లడించాడు. వాళ్ళ ప్రేమాయణంలో అడ్డు నిలవకండా వుండడానికి ప్రతిఫలం, తన కథకి బహుమతి!

ఇతరులకోసం చేసే ప్రతి పనిలో యిచ్చి పుచ్చుకోడాలు విధిగా వుండాలా? తనిప్పుడు రాజుని కలవాలి. పార్వతి విషయంలో అతనెలాగూ ప్రతిబంధకంకాదు. అతను రాణి కోసం పరితపిస్తున్నాడు కనక! శేఖరం రాజు కోసం బయల్దేరాడు. రూమునుంచి రిహార్సలుకి బయలుదేరుతున్నాడతను. శేఖరాన్ని చూడగానే వెనక్కి వచ్చాడు. ఇద్దరూ రూములో కూచున్నారు.

"ఊరక రారు మహాత్ములు! నువ్వు రూము వదిలి వచ్చేవంటే యివాళ వర్షం పడాల్సిందే! ఏమిటి విశేషం?"

"విశేషం కాదు, విశేషాలు?"

"చిత్రం! సెలవియ్యండి" నాటకీయంగా అన్నాడు రాజు.

"మిత్రోత్తమా! భవదీయ వైవాహిక కార్య కలాపము విరహవిలాపముగా మారనున్న విషఘడియలలో, ఆపద్బాంధవుని వలె అభయమొసంగెనే "

"రామారాయడు కదా, అతనినెట్లు మరువగలాడను?"

"తత్సుజ్జనుండు "

"బాబోయ్! మరి గ్రాంధికం వద్దు"

"అలా రా దార్లోకి! రామారావు ట్రంకాల్ చేశాడు!"

"మళ్ళీ యేం పీకలమీదికి తెచ్చాడు?"

"నీక్కాదు, అతనికే నీ అవస్థ కలిగింది."

"అతనికోసం మనం యెవరి దగ్గరికేనా రాయబారం వెళ్ళాలా?"

"అవసరం లేదులే! జానకిని నా కిద్దామనుకుంటున్నారట! గురుగారూ, మీరు మాట సాయం చెయ్యాలని అడిగాడు. అదొక విశేషం!"

"వరం యిచ్చేశావా?"

"కనీసం, నీకోసమైనా తప్పదుకదా!"

"రచయిత వనిపించుకున్నావ్! నీ పార్వతి గారికోసమని చెప్పక, నాకేదో వుపకారంవైనట్టు మాటాడతావేం?"

"పార్వతి కోసమన్నది మనలో మాట. బయటికి కనిపించేది, అతను నీకు సాయపడ్డాడు నీకోసం అతనికి నేను సాయపడతాను"

"రెండో విశేషం?"

"ఏబీ—బీసీ—సీయే"

"మహాప్రభో! నాకు అంకగణితమే సరిగా రాదు. బీజగణితంవేం తెలిసేడుస్తుంది?"

"నేను చెప్తానుకదా! ఏ నువ్వు—బి రామారావు—సి నేను"

"అంతవరకూ ఫరవాలేదు"

"బీ యే కి సాయపడ్డాడు. సి అంటే నేను బీకి సాయపడ్డాను. ఈ త్రిభుజంలో మిగిలిం దెవరు?"

"నాకు అతను, అతనికి నువ్వు—నీకు? నే నన్నమాట! సాల్వ్ చేసేశాను!"

"చెయ్యాదింకా, చెయ్యాలి. అందుకే వచ్చాను. పార్వతి ఫాదరు సూరిబాబుగారు ఆదివారం యిక్కడికి వస్తారుట, నీకోసం! అదీ విశేషం!"

"అంటే, నేనిప్పుడు నీకు లైన్‌క్లియర్ యివ్వాలన్నమాట. మా నాటకానికో పాతిక టిక్కెట్లు అమ్మిపెట్టు గురూ!"

"పాతిక టిక్కెట్లమ్మాలా, నా చిట్టి తండ్రే! పాతిక పైసలు కవరు రామారావు తండ్రికి రాసి పడేస్తాను"

"బాబ్బాబు? బాంచెను, కాల్మొక్తా!"

"అలా రా దార్లోకి!"

"దార్లోకి రావద్దని చెప్పడానికే కదోయ్ నువ్వొచ్చింది? రచయితలు కూడా అచ్చు తప్పులు "

"నా దారి కడ్డురాకు, సరేనా?"

"ముమ్మాటికీ సరే! అది సరేగాని, మన సెలక్షన్లు మాత్రమే అయేయి. వీటికి పెద్దల ఆమోద ముద్ర కావాలికదా! వాళ్ళని మన దారికి తేవడమెలా?"

"చెప్తాను! మీ మాంవగారిక్కడే వున్నారు కదా?"

"ఆహా, సలక్షణంగా అత్తగారూ సమేతులై"

"నాకోసం వ్యాసమూర్తిగారూ, నీకోసం సూరిబాబుగారూ యిక్కడికి వస్తారు."

"వస్తారు, మన దుంపతెంచడానికి"

"నువ్వు నోరు మూసుకుంటావా కాసేపు" చికాగ్గా అన్నాడు శేఖరం.

"నువ్వు స్వగతం మాటాడుకుంటున్నావని నాకేం తెలుసు? స్వగతం బేక్ కర్టెను వేపు తిరిగి చెప్పాలి కళ్ళెర్రజెయ్యకు మాటాడనులే ఎంచక్కా నవ్వేవురా? అలా సమస్యలు నగుమోముతో పరిష్కరిం చాలి. ఇద్దరు కన్యాదాతలు యిక్కడికి వస్తారు. మనంవేం చెయ్యాలిప్పుడు?"

"రామారావుని రమ్మని టెలిగ్రాం ఇస్తాం."

"చేతులు కట్టుకుని వాల్తాడు. తరవాత "

"తరవాత కథ వెండితెరమీద చూడండి"

## 4

రాజు తన నాటక బృందాన్ని వెంటబెట్టుకుని స్టేషనుకి వెళ్ళి బెజవాడనుంచి వచ్చే సూరిబాబు గార్ని రిసీవ్ చేసుకున్నాడు. పాదాభివందనం చేశాడు. రాజుకి తనపట్ల గల భక్తి భావానికి పరవశించాడాయన. వ్యక్తికంటె వ్యక్తిత్వం గొప్పది. ఆ వ్యక్తిత్వం పూజింపబడితే వ్యక్తి పరమానంద భరితుడౌతాడు!

"మీకు గుర్తుందో లేదోగానీ, తొలిసారి నాచే స్త్రీ పాత్ర ధరింపజేశారు. మీ శిక్షణలో నాట కంలో తొలిసారి వేషం కట్టేను. ఆ నాటి మీ ఆశీస్సులవల్ల యింతవాణ్నాయి యీనాడు పరి షత్తులలో గుర్తించబడ్డాను. నా నాటక కళకి రాజమార్గం చూపించినట్టే, నాకూ నా మిత్రు లకీ జీవితరంగంలోకూడా మీరు చేయూత నివ్వాలి. మీ అమూల్య ఆశీస్సులతో మా బ్రతు కులు తీర్చి దిద్దాలి." అంటూ చెప్పవలసిన విషయాలకి బీజం వేసేడు.

రామారావు, వ్యాసమూర్తీ కూడా అదే ట్రెయినులో దిగారు. రామారావు వ్యాస మూర్తిని రాజుకి పరిచయం చేశాడు. శేఖరం తరఫున రాజు ఆయన్ని ఆహ్వానించాడు. సూరిబాబు, వ్యాసమూర్తీ, రాజూ రామారావూ టాక్సీలో శేఖరం రూముకి వచ్చారు.

ప్రయాణ బడలిక తీర్చుకున్నాక సంప్ర దింపులు ప్రారంభమయేయి. శేఖరం పెద్దలిద్ద రికీ సంబంధాలలో సర్దుబాట్ల గురించి వివరిం చాడు. పెద్దల సహకారం అర్థించాడు. రామా రావూ రాజూ అతన్ని సమర్థించారు.

సూరిబాబూ వ్యాసమూర్తీ ఏకాంతంగా కొంచెంసేపు చర్చించుకున్నాక మిత్రత్రయం నిర్ణయాన్ని ఆమోదించారు. రాజు తరఫున రాణి తలిదండ్రులతో సంప్రదించి వాళ్ళని అంగీకరింపజేసే బాధ్యత సూరిబాబు వహిం చారు.

వ్యాసమూర్తి పెద్ద కూతురు పెళ్ళిలో మూడు జంటలకీ నిశ్చయ తాంబూలాలు పుచ్చు కుందికి నిర్ణయం జరిగింది, తమ తల్లిదండ్రులని అంగీకరింపజేసే బాధ్యత పెళ్ళికొడుకులదే నన్న షరతుమీద!! □